సాక్షి
పెద్దపల్లి

శుక్రవారం । 11 । జూలై । 2025



దుర్గామాతకు ప్రత్యేక పూజలు

గోదావరిఖని: సింగరేణి అధికారుల నివాసం బంగ్లాస్ ఏరియాలోని దుర్గామాత అమ్మవారికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాఢమాసం గురుపౌర్ణమి సందర్భంగా పలు రకాల కూరగాయలతో అమ్మవారిని అలంకరించారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అన్నదానం చేశారు. డైరెక్టర్ ఆపరేషన్ ఎల్వీ సూర్యనారాయణ, ఆర్జీ–1 జీఎం లలిత్‌కుమార్, సేవా అధ్యక్షురాలు అనిత, ఆర్జీ–2 జీఎం బండి వెంకటయ్య, ఆలయ కమిటీ సభ్యులు సుధ, స్వరూప, నీరజ, చిలుక లక్ష్మి, లేడీస్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.



ప్రభంజనం

- ఉమ్మడి జిల్లాలో రోజురోజుకు పెరుగుతున్న జనాభా
- జననాలు పెరుగుతుండగా తగ్గుతున్న మరణాలు
- భయపెడుతున్న పట్టణీకరణ సమస్య
- నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

సాక్షి,పెద్దపల్లి:

దేశ ప్రగతికి, పతనానికి ప్రధాన కారణమైన జనాభా ఇప్పుడు ప్రపంచాన్నే భయపెడుతున్న అతిపెద్ద సమస్య. జనాభా తగ్గుదలపై ప్రభుత్వాలు ఆందోళన చెందుతుండగా, మారిన జీవనశైలితో పిల్లలను కనేందుకు ఆసక్తిచూపని దంపతుల సంఖ్య పెరుగుతోంది. ఒక్కరు ముద్దు.. ఇద్దరు హద్దు.. ఇకపై వద్దంటూ ఒకప్పుడు ప్రభుత్వాలే ముమ్మరంగా ప్రచారం చేయగా, నేడు వీలైనంత మందిని కనండని ప్రభుత్వాలే వేడుకుంటున్నాయి. ఉమ్మడి జిల్లాలో జనాభా పెరుగుదల కనిపిస్తుండగా, మరణాలు సంఖ్య గణనీయంగా తగ్గాయి. పెరిగిన జనాభా విద్య, ఉపాధి అవకాశాల కోసం పట్టణాలకు వలసపోతుండడంతో పల్లె చిన్నబోతుంది. పంట పొలాలు కనుమరుగై ఆకాశహర్మ్యాలు వెలుస్తున్నాయి. కరీంగనర్, రామగుండం కార్పొరేషన్‌తో సహా జిల్లాకేంద్రాలుగా మారిన మున్సిపాలిటీలు, పంచాయతీల నుంచి మున్సిపాలిటీలుగా మారుతుండటం పట్టణాలకు వలసపోతున్న జనాభాకు నిదర్శనంగా నిలుస్తున్నాయి.

నియంత్రణతో అడ్డుకట్ట

జనాభా పెరుగుదల అభివృద్ధికి ఆటంకమన్న విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం కుటుంబ నియంత్రణ కార్యక్రమాలను అమలు చేసింది. అయినా 1952 నుంచి 1975 ఎమెర్జెన్సీ కాలం వరకు విపరీతంగా పెరిగింది. ఎమెర్జెన్సీ తర్వాత 1976లో ప్రకటించిన జాతీయ జనాభా విధానం అనుగుణంగా వివాహ వయస్సు పెంచడం, ఆర్థిక ప్రోత్సాహకాలు, మహిళ అక్షరాస్యత పెంపుతో జనాభా తగ్గుదల నమోదైంది. అయితే ఇటీవల కరోనా సమయం అనంతరం జనాభా స్థిరీకరణపై ప్రభుత్వాలు దృష్టిసారించాయి.

పట్టణీకరణే ప్రధాన సమస్య

జిల్లాల విస్తరణ, కొత్త మున్సిపాలిటీల ఏర్పాటుతో ఉపాధి, సౌకర్యవంతమైన జీవనం కోరుతూ ప్రజలు నగరం బాట పడుతున్నారు. కొత్త జిల్లాలుగా ఏర్పాడిన పెద్దపల్లి, జగిత్యాల, సిరిసిల్ల కేంద్రాల్లోనూ పట్టణీకరణ వేగం పుంజుకుంటోంది. ప్రభుత్వ వైద్యం, విద్యా సదుపాయాలను మెరుగుపరుస్తుండడం, కొత్త కట్టడాల నిర్మాణం పెరుగుతుండడంతో వివిధ వర్గాలకు ఉపాధి లభిస్తోంది. దీంతో ఆయా



కేంద్రాల్లో జనాభా పెరుగుదల కనిపిస్తోంది. దీంతో మున్సిపాలిటీల్లో జనాభా ఒత్తిడి పెరుగుతుంది. ఆయా జనాభాకు అనుగుణంగా ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించడం సవాలుగా మారుతుంది. పెరుగుతున్న పట్టణీకరణకు అనుగుణంగా వసతుల కల్పనపై ప్రత్యేక చొరవ చూపిస్తేనే సమస్యలు తీరనున్నాయి.


ఉమ్మడి జిల్లాలో పట్టణ ప్రాంతాల్లో పెరిగిన జనాభా..

పట్టణం	1991	2001	2011
కరీంనగర్	1,48,583	2,05,653	2,61,185
జగిత్యాల	67,591	85,521	96,460
రామగుండం	2,14,384	2,36,600	2,58,644
సిరిసిల్ల	50,048	65,314	77,550
కోరుట్ల	40,080	54,012	66,504


పెరిగిన జననాలు

జనన, మరణాలను అధికారికంగా నమోదు చేసే సివిల్ రిజిస్ట్రేషన్ సిస్టం–2021 నివేదిక ఆధారంగా 2021లో జిల్లాలో నమోదైన జననాలను విడుదల చేసింది. ఈ నివేదిక ఆధారంగా చూస్తే 43,345 జననాలు ఉండగా, మరణాలు 26,757 నమోదయ్యాయి. మెడికల్ వసతులు పెరగడం కారణంగా తెలుస్తోంది.


● ఎ) ● బి) ● సి)




1)ప్రస్తుతం సమాజంలో పేరెంట్స్ ఎంత మంది పిల్లలు కావాలనుకుంటున్నారు?
ఎ)ఒక్కరు బి)ఇద్దరు
సి)ముగ్గురు అంతకన్నా ఎక్కువ




2)ఒక్కరికి మించి పిల్లలు వద్దనడానికి కారణాలు?
ఎ)పిల్లల పోషణ ఖర్చు పెరుగుదల
బి)మైక్రో కుటుంబాలు
సి)ఇతర అంశాలు



3)దేశ అభివృద్ధికి ఏది మంచిదని మీరు అనుకుంటున్నారు?
ఎ)జనాభా పెరుగుదల
బి)జనాభా తగ్గుదల సి)తెలియదు



4)జనాభా పెరుగుదల వల్ల ఎలాంటి సమస్యలు ఎదురవుతాయని మీరు భావిస్తున్నారు?
ఎ)వనరుల కొరత బి)నిరుద్యోగం
సి)ఇతర అంశాలు



5)జనాభా తగ్గుదల వల్ల ఎదురయ్యే సవాళ్లు ఏమైనా ఉంటాయని మీరు భావిస్తున్నారా?
ఎ)వృద్ధాప్య జనాభా పెరుగుదల
బి)కార్మిక శక్తి కొరత
సి)ఆర్థికమాంద్యం

సీఆర్ఎస్-2021 నివేదిక ప్రకారం జననాలు

జిల్లా	మగ	ఆడ	మొత్తం
కరీంనగర్	11,726	10,063	21,789
పెద్దపల్లి	4,834	4,538	9,372
జగిత్యాల	6,134	6,050	12,184
సిరిసిల్ల	2,690	2,338	5,028

సీఆర్ఎస్- 2021 నివేదిక ప్రకారం మరణాలు

జిల్లా	మగ	ఆడ	మొత్తం
కరీంనగర్	5,353	3,138	8,491
పెద్దపల్లి	3,984	2,582	6,566
జగిత్యాల	3,995	2,575	6,570
సిరిసిల్ల	3,027	2,103	5,130

2011 జనాభా ప్రకారం

జిల్లా	మహిళలు	పురుషులు	మొత్తం
జగిత్యాల	4,85,819	5,03,094	9,88,913
పెద్దపల్లి	3,97,585	3,94,251	7,91,836
కరీంనగర్	5,04,620	5,01,091	10,05,711
సిరిసిల్ల	2,74,109	2,77,928	5,52,037

గ్రామీణ, పట్టణ జనాభా

జిల్లా	గ్రామీణం	పట్టణం
జగిత్యాల	7,67,577	2,21,336
పెద్దపల్లి	4,87,823	3,04,013
కరీంనగర్	6,96,727	3,08,984
సిరిసిల్ల	4,35,145	1,16,892

లింగనిష్పత్తి

జిల్లా	మొత్తం జనాభా పరంగా	ఆరేళ్ల పిల్లల జనాభా పరంగా
జగిత్యాల	1,036	947
పెద్దపల్లి	992	922
కరీంనగర్	993	931
సిరిసిల్ల	1,014	942

ఆరేళ్ల లోపు పిల్లలు (2011 జనాభా ప్రకారం)

జిల్లా	బాలురు	బాలికలు	మొత్తం
జగిత్యాల	48,048	45,523	93,571
పెద్దపల్లి	34,614	31,899	66,513
కరీంనగర్	46,124	42,955	89,079
సిరిసిల్ల	25,099	23,652	48,751

ఆరుగురు పిల్లలతో ఆనందంగా..



కోల్‌సిటీ(రామగుండం): మాది పెద్దపల్లి జిల్లా గుర్రంపల్లి గ్రామం. 1987లో నాకు పరుగు పందెం ద్వారా సింగరేణిలో ఉద్యోగం రావడంతో, భార్య లక్ష్మితో గోదావరిఖని పైవింక్లయిన్ ఏరియాకు వలసొచ్చినం. అప్పటికే మాకు నలుగురు కొడుకులు రాజు, సదానందం, మల్లేశ్, ప్రదీప్‌తోపాటు కూతురు విజయ ఉన్నారు. గోదావరిఖనికి వచ్చాక చిన్న కొడుకు శ్రీనివాస్ పుట్టాడు. ఆరుగురు పిల్లలను చదివించి ఏ కష్టం రాకుండా పెద్దవాళ్లను చేశాం. 2020లో రిటైర్ అయ్యాను. చిన్న కొడుకు తప్ప, అందరికీ పెళ్లిల్లు చేశాం. కోడళ్లు, అల్లుడు, మనమలు, మనమరాళ్లతో సందడిగా ఉంటుంది. ఇల్లు సరిపోకపోవడంతో దగ్గర్లోనే పిల్లలందరూ వేర్వేరుగా ఉంటున్నారు. కానీ, ఏ పండుగైనా, వేడుకలైనా కలిసి చేసుకుంటాం. కలిసి వంటలు చేసుకొని సంబరంగా కష్టసుఖాలను పంచుకుంటూ ఆనందంగా గడుతున్నాం.
– దుడపాక నర్సయ్య, సింగరేణి రిటైర్డ్ కార్మికుడు, గోదావరిఖని

ఒక్కరైతే మంచి లైఫ్ ఇవ్వొచ్చు



కోల్‌సిటీ(రామగుండం): కుటుంబంలో పిల్లలను ఎక్కువగా కనడం ద్వారా ఇంటి పెద్ద చేస్తున్న ఉద్యోగానికి వేతనాలు సరిపోకపోతే ఆర్థిక ఇబ్బందులతో వారికి మంచి జీవితాన్ని కల్పించకపోవచ్చు. ఒక్కరు, లేదా ఇద్దరు పిల్లలుంటే వారికి మంచి లైఫ్‌ను ఇవ్వొచ్చు. ఇదే విషయాన్ని నేను, భార్య ఫర్వీన్ కూడా నమ్మినం. మాకు పాప అయినా, బాబు అయినా ఒక్కరైతే చాలనుకున్నాం. అదృష్టం కొద్దీ మాకు పాప పుట్టింది. మా పాపను డాక్టర్ చదివించాం. ఇప్పుడు హైదరాబాద్ కిమ్స్‌లో డాక్టర్‌గా సేవలందిస్తోంది. చాలా కుటుంబాలు ఎక్కువ పిల్లలను కని ఆర్థిక ఇబ్బందుల్లో నలిగిపోతున్నాయి.
– ఎండీ ఆసీఫ్, సింగరేణి ఓసీపీ–2 అడిషనల్ మేనేజర్, గోదావరిఖని

జనాభాపై సాంకేతిక ప్రభావం



గోదావరిఖనిటౌన్(రామగుండం): జనాభాపై సాంకేతిక ప్రభావం చాలా పెద్దది. సాంకేతికత కారణంగా అభివృద్ధి చెందిన దేశాల్లో సంతానోత్పత్తి రేటు తగ్గింది. ప్రస్తుత కాలంలో కృత్రిమ మేధస్సు కారణంగా జనాభా అనేక సవాళ్లను ఎదుర్కొంటుంది. వారి పని సాంకేతికత ద్వారా తీసివేయబడింది. కాబట్టి జనాభా ఎక్కువ ఉన్నప్పటికీ శాంతియుత సమాజానికి స్థిరమైన సాంకేతిక వృద్ధి చాలా ముఖ్యం.
– డాక్టర్ సూర్యవన్షి రమాకాంత్, ప్రిన్సిపాల్, యూనివర్సిటీ పీజీ కళాశాల, గోదావరిఖని

న్యూస్‌రీల్

కోర్టు ఆవరణలో డిస్పెన్సరీ ప్రారంభం



ప్రారంభిస్తున్న జడ్జి సునీత కుంచాల, డీఎంహెచ్‌వో అన్నప్రసన్నకుమారి

పెద్దపల్లిరూరల్: జిల్లా న్యాయస్థాన ఆవరణలో వైద్యసేవలు అందించేందుకు వీలుగా ఏర్పాటు చేసిన డిస్పెన్సరీని గురువారం జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల, డీఎంహెచ్‌వో అన్నప్రసన్న కుమారి, బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్‌తో కలిసి ప్రారంభించారు. గవర్నమెంట్ ప్లీడర్ మార కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణ స్థలం పరిశీలన



కోర్టు నిర్మాణ స్థలం పరిసరాలను పరిశీలిస్తున్న జడ్జి గణేశ్

ఓదెల(పెద్దపల్లి): ఓదెలలో కోర్టు భవన నిర్మాణ స్థలాన్ని గురువారం సుల్తానాబాద్ జడ్జి గణేశ్ పరిశీలించారు. ఓదెల, కాల్వశ్రీరాంపూర్ మండలాల ప్రజల సౌకర్యార్థం కోర్టు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి మండలం స్థితిగతులను తెలుసుకున్నారు. తహసీల్దార్ కె.ధీరజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని డివిజన్లలో సర్వే చేయండి



మాట్లాడుతున్న కమిషనర్ అరుణశ్రీ

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం నగరపాలక సంస్థలో వీధి వ్యాపారుల సౌకర్యార్థం వెంటనే వెండింగ్ జోన్లు గుర్తించాలని కమిషనర్ (ఎఫ్ఏసీ) జె.అరుణశ్రీ అన్నారు. గురువారం కార్యాలయంలో నిర్వహించిన టౌన్‌వెండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. నగరపాలక సంస్థలో నూతన గ్రామాలు విలీనమైన నేపథ్యంలో మెప్మా, పట్టణ ప్రణాళికా విభాగం, ట్రాఫిక్ పోలీస్‌శాఖ సంయుక్తంగా సర్వే చేయాలన్నారు. ఈ సర్వేలో డివిజన్ల వారీగా రెడ్, గ్రీన్, అంబర్ వెండింగ్ జోన్లు గుర్తించాలన్నారు. వీధి వ్యాపారుల జాబితాలో అనర్హులను తొలగించి అర్హులను చేర్చాలన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థల బారిన వీధి వ్యాపారులు పడకుండా, బ్యాంకుల సహకారంతో పీఎం స్వనిధి రుణాలు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. డిప్యూటీ కమిషనర్ వెంకటస్వామి, ట్రాఫిక్ సీఐ బి.రాజేశ్వర్‌రావు, టౌన్ ప్లానింగ్ విభాగం ఏసీపీ శ్రీహరి, టీపీవో నవీన్, ఆర్‌వో ఆంజనేయులు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సీహెచ్ వెంకటేశ్, మెప్మా టీఎంసీ మౌనిక తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీలో అక్రమాలకు పాల్పడితే చర్యలు



ప్రజావేదికలో అధికారులు, తదితరులు

ఎలిగేడు(పెద్దపల్లి): ఉపాధి హామీలో అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఏపీడీ సత్యనారాయణ అన్నారు. 01–04–2024 నుంచి 31–3–2025 వరకు జరిగిన ఉపాధి పనులపై గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. 2024–25లో పంటపొలాలకు రోడ్లు, చెరువుల పూడికతీత, తదితర రూ.3,38,35,606 విలువైన పనులు చేయగా అందులో కూలీలకు రూ.2,07,23,288, స్కిల్డ్ కింద రూ.93,000, మెటీరియల్‌కు రూ.1,30,19,318 చెల్లించారు. ఈసందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ, పని అడిగిన ప్రతీ ఒక్కరికి జాబ్‌కార్డు అందించాలని, ఉపాధి సిబ్బంది అవకతవకలకు పాల్పడకుండా, పొరపాట్లు జరగకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పనుల్లో చిన్న చిన్న పొరపాట్లను గుర్తించిన అధికారులు రూ.13,024 రికవరీకి ఆదేశించారు. అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి కొమురయ్య, ఎంపీడీవో భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే

- ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో పేదలకు రేషన్ ద్వారా సన్నబియ్యం ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. గురువారం మండలంలోని సుద్దాల, రేగడిమద్దికుంట, అల్లిపూర్ గ్రామాల్లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేయడంతో పాటు ఇందిరమ్మ ఇళ్లకు ముగ్గు పోశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలోని గ్రామాల్లో మౌలిక వసతుల కోసం కోట్ల రూపాయాలు వెచ్చించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ మద్దతుదారులను గెలిపించాలని కోరారు. జిల్లా గ్రంథాలయ చైర్మన్ అన్నయ్యగౌడ్, ఏఎంసీ చైర్మన్ ప్రకాశ్‌రావు, మండల అధ్యక్షుడు చిలుక సతీశ్, నాయకులు జాని, అబ్బయ్యగౌడ్, దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడాలి



మొక్క నాటుతున్న డీఎఫ్‌వో శివయ్య

రామగుండం: ప్రతీ విద్యార్థి తమ పుట్టిన రోజు వేడుకలను పురస్కరించుకొని ఒక మొక్క నాటి సంరక్షణ బాధ్యతలు స్వీకరించినప్పుడే పర్యావరణ పరిరక్షణకు పాటుపడిన వారవుతారని జిల్లా అటవీశాఖ అధికారి శివయ్య అన్నారు. గురువారం వన మహోత్సవంలో భాగంగా అంతర్గాం జిల్లా పరిషత్ హైస్కూల్, కేజీవీబీ విద్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటి మాట్లాడారు. ఏటా ముమ్మరంగా మొక్కలు నాటినా వాటి సంరక్షణలో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోనే మొక్కల ఎదుగుదల లోపిస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. దశాబ్దకాలం క్రితం పోల్చితే ప్రస్తుతం అటవీ విస్తీర్ణం గణనీయంగా పెరిగిందన్నారు. ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ టి.సతీశ్ కుమార్, డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ కొమురయ్య, దేవదాస్, జిల్లా స్ట్రైక్ ఫోర్స్ అధికారి సయ్యద్ రహ్మతుల్లా, సెక్షన్ ఆఫీసర్ మంగీలాల్, మిర్జా ఇర్షద్, మేఘరాజ్, స్రవంతి, ఎంపీడీవో వేణుమాధవ్, ఏపీవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పొరపాటైంది.. ప్రొటోకాల్ పాటిస్తాం

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలో నిర్వహించే అధికారిక కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం తనకు అందడం లేదంటూ ఎంపీ గడ్డం వంశీకృష్ణ కేంద్రంలోని చీఫ్ సెక్రటరీకి చేసిన ఫిర్యాదుపై అధికారులు స్పందించి జిల్లా కలెక్టర్‌ను అందుకు గల కారణాలు చెప్పాలన్నారు. ఇందుకు కలెక్టర్ క్షమాపణ తెలుపుతూ భవిష్యత్తులో ఇలాంటి తప్పిదాలు జరగకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఇకమీదట జిల్లాలో జరిగే అధి కారిక కార్యక్రమాల్లో ప్రొటోకాల్ పాటించడంలో పొరపాట్లు దొర్లకుండా ఉండేందుకు వీలుగా ఓ ఉద్యోగిని ప్రత్యేకంగా నియమించినట్లు సమాచారం.

విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

ముత్తారం(మంథని): మండలంలోని పలు గ్రామాల్లో గురువారం కలెక్టర్ కోయ శ్రీహర్ష పర్యటించారు. మచ్చుపేట, లక్కారం, పారుపల్లి, అడవిశ్రీరాంపూర్ ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. విద్యార్థులకు ప్రశ్నలు వేస్తూ సమాధానాలు రాబట్టారు. బోధన, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. ప్రైవేట్‌కు దీటుగా విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. శిథిలావస్థలో ఉన్న చెంచుల ఇళ్లు, అడవిశ్రీరాంపూర్ టీఫైబర్ ఇంటర్నేట్ ద్వారా నడుస్తున్న డిజిటల్ క్లాసును పరిశీలించారు. మచ్చుపేటలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలిస్తూ అర్హులకు మంజూరు చేస్తామన్నారు. అనంతరం గ్రామంలోని పల్లె దవాఖానాను సందర్శించి స్థానికంగా ఉంటూ మెరుగైన వైద్యం అందించాలని సిబ్బందికి సూచించారు. ముత్తారంలోని ఐకేపీ రుద్రమ మండల మహిళ సమాఖ్య ఆధ్వర్యంలో చిల్లి తయారీనీ పరిశీలించారు. డీఆర్‌డీఏ పీడీ కాళిందిని, ఎంపీడీవో సురేశ్, ఏపీఎం పద్మ తదితరులు పాల్గొన్నారు.







గురుపౌర్ణమి సందడి

గురుపౌర్ణమి సందర్భంగా గురువారం సాయిబాబా ఆలయాల్లో సందడి నెలకొంది. జిల్లా కేంద్రంలోని శాంతినగర్ సాయిబాబా ఆలయంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని పూజలు చేశారు. ఉదయం ప్రభాతసేవతో మొదలు అభిషేకాలు, అలంకరణ హారతి, అన్నదానం నిర్వహించి భక్తిని చాటుకున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

సమష్టి కృషితో లక్ష్యాలు సాధించాలి

రామగిరి: సమష్టి కృషితో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలను సాధించుకోవాలని సింగరేణి డైరెక్టర్ (పర్సనల్, అడ్మినిస్ట్రేషన్, వెల్ఫేర్) గౌతమ్ పొట్రు అన్నారు. గురువారం ఆర్జీ–3 , ఏపీఏ గనిలో పర్యటించారు. జీఎం కార్యాలయంలోని సమావేశ మందిరంలో జీఎంలు నరేంద్ర సుధాకర్‌రావు, కొలిపాక నాగేశ్వరరావు, వివిధ విభాగాధిపతులతో సమీక్ష నిర్వహించారు. లక్ష్యాల సాధనకు తీసుకుంటున్న చర్యలను డైరెక్టర్‌కు జీఎంలు వివరించారు.

గనిలోకి దిగిన డైరెక్టర్

అతిపెద్ద భూగర్భ గని అయిన అడ్రియాల లాంగ్‌వాల్ ప్రాజెక్టు ఏరియాలో గురువారం డైరెక్టర్ పా గౌతమ్ పొట్రు పర్యటించారు. ముందుగా ఏపీఏ గని ఆవరణలో మొక్కనాటారు. అనంతరం మ్యాన్ రైడింగ్ ద్వారా భూగర్భ గనిలోకి వెళ్లి బొగ్గు ఉత్పత్తి చేస్తున్న యంత్రాల పనితీరును పరిశీలించారు. అధికారులు కె.యాదయ్య, ఎం.రామ్మోహన్, బండి సత్యనారాయణ, జే.రాజశేఖర్, సీహెచ్.వెంకటరమణ, ప్రవీణ్ వి ఫాంటింగ్, బి.సుదర్శనం, గుర్రం శ్రీహరి, మేఘన, టి.రఘురాం, సునీల్‌కుమార్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.



గనిలోనికి వెళ్తున్న డైరెక్టర్(పా) గౌతమ్ పొట్రు

క్లుప్తంగా

ధాన్యం లారీల పట్టివేత



సుల్తానాబాద్‌రూరల్/సుల్తానాబాద్/కాల్వ శ్రీరాంపూర్: సీఎంఆర్ రైస్ కోసం ప్రభుత్వం కొనుగోలు చేసిన వరిధాన్యాన్ని రైస్ మిల్లర్లు ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా గురువారం రాత్రి టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. వివరాలు.. సుల్తానాబాద్ మండలం కాట్నపల్లి శివారులోని సాయిమహాలక్ష్మీ, సౌభాగ్యలక్ష్మీ రైస్‌మిల్లుల నుంచి ఎలాంటి వే బిల్లులు లేకుండా 5లారీల్లో వరిధాన్యం బస్తాలను ఇతర ప్రాంతాలకు తరలిస్తుండగా.. టాస్క్‌ఫోర్స్ ఉన్నతాధికారి ప్రభాకర్ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ సిబ్బంది లారీలను పట్టుకుని స్థానిక పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ ధాన్యంపై టాస్క్‌ఫోర్స్, సివిల్ సప్లై అధికారులు విచారిస్తున్నారు. పూర్తి విచారణ తర్వాత శుక్రవారం వివరాలు వెల్లడిస్తామని అధికారులు తెలిపారు.

శ్రీశైలం ఆలయానికి ప్రత్యేక బస్సు

గోదావరిఖనిటౌన్(రామగుండం): శ్రీశైలం మల్లికార్జునస్వామి తీర్థయాత్రకు ఈ నెల 14న సాయంత్రం 6 గంటలకు గోదావరిఖని బస్టాండ్ నుంచి సూపర్ లగ్జరీ బస్సు బయలుదేరనున్నట్లు డిపో మేనేజర్ నాగభూషణం తెలిపారు. 15న శ్రీశైలం చేరుకుంటుందని దర్శనం అనంతరం అహోబిలం, యాగంటి దర్శనం తర్వాత 17న గోదావరిఖనికి చేరుకుంటుందని పేర్కొన్నారు. ఒకరికి టికెట్ ధర రూ.3,300 నిర్ణయించామని, మరిన్ని వివరాలకు 70135 04982, 79898 47927 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

మల్లన్న బ్రహ్మోత్సవాలకు వేళాయె..

- 13న పెద్దపట్నం.. 14న అగ్నిగుండాలు

ఓదెల(పెద్దపల్లి): ఓదెల మల్లికార్జునస్వామి పెద్దపట్నం బ్రహ్మోత్సవాలు ఈనెల13న జరుగుతాయి. ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, మంటపస్థాపన, వీరభద్రారాధన రాత్రి భద్రకాళి అవాహన, రాత్రి 10 నుంచి పెద్దపట్నం కార్యక్రమం ప్రారంభమవుతోంది. 14న వేకువజామున 5గంటలకు అగ్నిగుండ ప్రజ్వలన దాటుట, దక్షయాగ కథాశ్రవణం నిర్వహిస్తారు.



మల్లికార్జునస్వామి

ముస్తాబైన ఆలయం

భక్తులకు కొంగు బంగారం ఓదెల మల్లికార్జునస్వామి సన్నిధిలో పెద్దపట్నం బ్రహ్మోత్సవాలు, అగ్నిగుండం దాటుట కార్యక్రమాలకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. మల్లికార్జునస్వామి, ఖండేలరాయుడు, నందీశ్వరులు, సీతారామచంద్రస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. స్వామివారి బ్రహ్మోత్సవాలకు ఉత్తరతెలంగాణ జిల్లాలతో పాటు పాటు మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివస్తారు. కరీంనగర్, గోదావరిఖని, మంథని డిపోల నుంచి ఓదెలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉంది. అలాగే సికింద్రాబాద్, కాజీపేట్, భద్రాచలం నుంచి ఓదెల మీదుగా వచ్చే ఇంటర్‌సిటీ, భాగ్యనగర్, రామగిరి, సింగరేణి, సిర్పూర్‌కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ రైళ్ల సౌకర్యం కూడా ఉంది.



విద్యుత్‌కాంతుల్లో ఆలయం

ఏర్పాట్లు చేశాం



ఓదెల మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు చేశాం. పెద్దపట్నం, అగ్నిగుండ మహోత్సవ కార్యక్రమాలకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తాం.

– బి.సదయ్య, ఈవో, ఓదెల

ఆర్టీసీ బస్సు, లారీ ఢీ: తప్పిన ప్రమాదం

మెట్‌పల్లి: పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్నాయి. నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు ఒంగోలు వెళ్తూ.. మెట్‌పల్లి బస్‌స్టేషన్‌లో ఆగింది. ప్రయాణీకులతో జగిత్యాల వైపు బయలుదేరిన బస్సు.. ఔట్ గేట్ నుంచి జాతీయ రహదారి పైకి వెళ్లగానే ఓ లారీ వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో బస్సు అద్దాలు పగిలిపోయి ముందు భాగం దెబ్బతింది. ప్రయాణికులు, సిబ్బందికి ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దెబ్బతిన్న వాహనాన్ని బస్‌స్టేషన్‌కు తరలించి నిర్మల్ డిపోకు సమాచారమందించారు. అక్కడి అధికారులు ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా మరో బస్సును పంపించారు.



ప్రమాదంలో దెబ్బతిన్న బస్సు

సమ్మెతో సింగరేణికి నష్టం

- సంస్థకు రూ.30 కోట్లు, కార్మికులకు రూ.13 కోట్ల నష్టం
- సంస్థవ్యాప్తంగా హాజరు 15 శాతమే
- కార్మిక సంఘాల్లో నూతనోత్సాహం



గోదావరిఖని(రామగుండం): దేశవ్యాప్త సమ్మె పిలుపులో భాగంగా సింగరేణిలో ఒక్కరోజు టోకెన్ సమ్మె ఈనెల 9న విజయవంతమైంది. సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. బీజేపీ అనుబంధ బీఎంఎస్ మాత్రం దూరంగా ఉంది. సమ్మె విజయవంతానికి అన్ని కార్మిక సంఘాలు గనులపై విస్తృత ప్రచారం చేశాయి. కార్మికులకు సంబంధించి ప్రధాన డిమాండ్ లేబర్‌కోడ్ కూడా పొందుపర్చడంతో సమ్మె పిలుపునకు మంచి స్పందన లభించింది. సింగరేణి కార్మికులు సమ్మెలో స్వచ్ఛందంగా పాల్గొనగా విజయవంతమైంది. ఈ క్రమంలో ఒక్కరోజు టోకెన్ సమ్మె సంస్థకు భారీ నష్టాన్ని మిగిల్చింది. సంస్థవ్యాప్తంగా ఒక్కరోజు 1.75లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి సాధించాల్సి ఉండగా, 80వేల టన్నులు మాత్రమే ఉత్పత్తి జరిగింది. దీంతో సంస్థకు సుమారు రూ.30కోట్ల నష్టం జరిగినట్లు భావిస్తున్నారు. అలాగే సంస్థవ్యాప్తంగా 40వేల మంది కార్మికులు పనిచేస్తుండగా, 6వేల మంది అత్యవసర సిబ్బంది మాత్రమే విధులకు హాజరయ్యారు. సంస్థ వ్యాప్తంగా 25వేల మంది కాంట్రాక్టు కార్మికులకు సమ్మెలో పాల్గొన్నారు.

మూడు ఏరియాల్లో ఉత్పత్తి నిల్

సమ్మె ప్రభావం సంస్థపై చూపింది. 11 ఏరియాలకు గాను 8 ఏరియాల్లో 46 శాతం మేర బొగ్గు ఉత్పత్తి కాగా, మందమర్రి, బెల్లంపల్లి, ఏపీఏ ఏరియాల్లో ఉత్పత్తి పూర్తిగా నిలిచిపోయింది. మిగతా ఏరియాలోని గనులు కొద్దిమేర ఉత్పత్తి సాధించాయి.

రూ.30 కోట్ల నష్టం

సింగరేణిలో సమ్మె మూలంగా సుమారు రూ.30కోట్ల మేర ఉత్పత్తి నష్టం వాటిల్లినట్లు చెబుతున్నారు. అలాగే కార్మికులు వేతనాల రూపంలో రూ.13 కోట్ల మేర నష్టపోయారు. సమ్మెతో కార్మికులు, యాజమాన్యం ఇద్దరు నష్టపోయినా కార్మికులకు సంబంధించి దీర్ఘకాలిక సమస్యలపై కేంద్రం దిగివచ్చే అవకాశం ఉందని పేర్కొంటున్నారు.

సంఘాల్లో నూతనోత్సాహం

సంస్థ వ్యాప్తంగా చేపట్టిన ఒక్కరోజు సమ్మె సక్సెస్ కావడంతో కార్మిక సంఘాల నాయకుల్లో ఉత్సాహం నెలకొంది. సంస్థలో గుర్తింపు యూనియన్‌గా గెలుపొందిన ఏఐటీయూసీ, ప్రాతినిధ్య సంఘం ఐఎన్‌టీయూసీ, గతంలో గుర్తింపు సంఘంగా గెలిచిన టీబీజీకేఎస్, జాతీయ కార్మిక సంఘాలు సీఐటీయూసీ, హెచ్ఎంఎస్, విప్లవ కార్మిక సంఘాలు ఐఎఫ్‌టీయూసీ, ఏఐఎఫ్‌టీయూ తదితర సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయి. అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లు, కాంట్రాక్టు కార్మికుల్లో విస్తృత ప్రచారం చేయడంతో కార్మికులు సమ్మెకు మొగ్గు చూపారు. సమ్మె విజయవంతంతో రాబోయే రోజుల్లో కూడా ఇదే స్ఫూర్తితో ముందుకు సాగాలని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయకుండా దేశవ్యాప్త నిరవధిక సమ్మెకైనా వెనకాడబోమని చెబుతున్నాయి.

సంస్థలో 09-07-25 రోజు టార్గెట్.. (వేల టన్నుల్లో..)

ఏరియా	టార్గెట్	సాధించింది
కొత్తగూడెం	36,793	20,033
ఇల్లెందు	8,192	3,009
మణుగూరు	28,093	16,525
బెల్లంపల్లి	7,407	-
మందమర్రి	7,519	-
శ్రీరాంపూర్	18,122	2,837
ఆర్జీ–1	11,885	6,740
ఆర్జీ–2	25,204	20,013
ఆర్జీ–3	16,296	5,696
ఏఈపీ	5,011	-
భూపాల్‌పల్లి	10,796	6,091
మొత్తం	1,75,318	80,944

ప్రాణం తీసిన భూ తగాదా

- వరుసకు అన్నపై తమ్ముడి దాడి
- ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి



రవి (ఫైల్)

ధర్మపురి: భూతగాదాలో గొడవ పడి వరుసకు అన్న అయిన రవిపై తమ్ముడు కత్తితో దాడి చేయడంతో మృతిచెందాడు. గ్రామస్తుల కథనం ప్రకారం.. మండలంలోని దోనూర్‌కు చెందిన గొల్లెన రవి, నాగరాజు అన్నదమ్ముల కొడుకులు. వారి మధ్య కొంతకాలంగా ఇంటిస్థలం విషయంలో గొడవలు జరుగుతున్నాయి. ఇటీవల రవికి ఇందిరమ్మ ఇల్లు మంజూరుకాగా నిర్మాణం చేపడుతున్నాడు. గురువారం ఇంటి స్థలం విషయంలో ఇరువురి మధ్య గొడవ జరగగా నాగరాజు రవిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రవిని చికిత్స నిమిత్తం జగిత్యాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ప్రయత్నించినా ఫలితం కనిపించలేదు. చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

ఠాణా ఎదుట బీఆర్‌ఎస్ ఆందోళన



పోలీసుస్టేషన్ ఎదుట బీఆర్‌ఎస్ శ్రేణులు

రామగిరి(మంథని): తమ నాయకుడిని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేశారని గురువారం రాత్రి బీఆర్‌ఎస్ నాయకులు రామగిరి పోలీసుస్టేషన్ ఎదుట ఆందోళన నిర్వహించారు. వివరాలు.. మండలంలోని నాగెపల్లి గ్రామానికి చెందిన యువకుడికి కనగర్తి గ్రామానికి చెందిన యువతితో నెల రోజుల క్రితం ప్రేమ వివాహం జరిగింది. ఈ విషయంపై యువతి తల్లిదండ్రులు గతంలోనే పెద్దపల్లి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ప్రేమజంట పోలీసుస్టేషన్‌ను ఆశ్రయించింది. తర్వాత యువతిని వారి తల్లిదండ్రులు తీసుకెళ్లగా మళ్లీ తల్లిదండ్రులతో ఉండలేక యువకుడి చెంతకు చేరింది. ఈక్రమంలో యువతి కనిపించడం లేదని పెద్దపల్లి రూరల్ పోలీసుస్టేషన్‌లో వారి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత పోలీసులు యువతి వాంగ్మూలం కోసం నాగెపల్లి గ్రామానికి వెళ్లగా యువకుడి తరఫున గ్రామానికి చెందిన కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్ పోలీసుల విధులకు ఆటంకం కలిగించడంతో పాటు వాగ్వాదానికి దిగారని అతడిని రామగిరి పోలీసుస్టేషన్‌కు తరలించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, మండల బీఆర్‌ఎస్ నాయకులు పోలీసుస్టేషన్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. ఒక దశలో పోలీసులు, బీఆర్‌ఎస్ నాయకులకు వాగ్వాదం జరుగగా పోలీసులు లాఠీచార్జి చేశారని బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. సుమారు 3 గంటలపాటు స్టేషన్ ఎదుట హైడ్రామా కొనసాగగా సత్యనారాయణపై పలు సెక్షన్‌ల కింద కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

కానిస్టేబుల్‌పై మహిళ ఫిర్యాదు



ఫిర్యాదు కాపీతో డీఎస్పీ కార్యాలయం వద్ద భావన

జగిత్యాలక్రైం: తనను కానిస్టేబుల్ బండపల్లి ప్రసాద్ ప్రేమ వివాహం చేసుకుని మోసం చేయడంతోపాటు మరో యువతితో ఇటీవల కనిపించకుండా పోయాడంటూ సారంగాపూర్ మండలం బీర్‌పూర్ గ్రామానికి చెందిన కస్తూరి భావన జగిత్యాల డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది. భావన జగిత్యాలలో హాస్టల్‌లో ఉన్న సమయంలో ఒకసారి డయల్ 100కు కాల్ చేసింది. ఆ సమయంలో పరిచయమైన కొడిమ్యాల మండలం శ్రీరాములపల్లికి చెందిన బండపల్లి ప్రసాద్ అనే కానిస్టేబుల్ మాయమాటలు చెప్పి ప్రేమ పెళ్లి చేసుకున్నాడు. కొద్దిరోజులు తనతో కాపురం చేసి.. కొన్నాళ్లుగా మానసికంగా, శారీరకంగా వేధిస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం మల్యాల మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో కనిపించకుండాపోయాడని, అతడిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది.

చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్

రామగుండం: తాళం వేసిన ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న ఇద్దరిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. గోదావరిఖని ఇన్‌చార్జీ ఏసీపీ కృష్ణ వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని చంద్రాపూర్ జిల్లా చునాలా గ్రామానికి చెందిన కాకట్ల కేశవరెడ్డి కొన్నేళ్లుగా రామగుండంలోని అంబేద్కర్‌నగర్‌లో బాణాల విష్ణు ఇంట్లో అద్దెకు ఉంటున్నాడు. కాగా విష్ణు స్థానిక భరత్‌నగర్‌లో జ్యూవెల్లరీ షాపు నిర్వహిస్తుండగా కేశవరెడ్డితో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో కేశవరెడ్డి జల్సాలకు అలవాటు పడి డబ్బు సర్దుబాటు కోసం చోరీలు చేయాలని నిర్ణయించుకున్నాడు. బైక్‌పై రెక్కీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లలో రాత్రి వేళ చోరీలకు పాల్పడేవాడు. చోరీ చేసిన సొత్తును విష్ణు వద్ద విక్రయించేవాడు. కాగా ఇటీవల కాలంలో రామగుండం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆరు, ఎన్టీపీసీ పీఎస్ పరిధిలో 2, గోదావరిఖని వన్‌టౌన్ పరిధిలో ఒక చోరీ చేసినట్లు ఒప్పుకున్నారు. గురువారం పోలీసులు పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో అనుమానాస్పదంగా కనిపించిన వారిని విచారించడంతో చోరీలు వెలుగుచూశాయి. వారి నుంచి 85 గ్రాముల బంగారం, 1,950 గ్రాముల వెండి, మూడు ద్విచక్ర వాహనాలు, రూ.3,670 నగదు, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ పేర్కొన్నారు. కాగా ఈ కేసులను చాకచక్యంగా ఛేదించిన రామగుండం సీఐ, ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, సంధ్యారాణి, సిబ్బంది ప్రభాకర్‌రావు, రవి తదితరులను ఏసీపీ అభినందించారు.

అత్యాచారయత్నం కేసులో మూడేళ్ల జైలు

గోదావరిఖనిటౌన్(రామగుండం): అత్యాచారానికి యత్నించి, మహిళను గాయపర్చిన కేసులో నిందితుడు భూక్యా నరేశ్ (అఖిల్)కు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.200 జరిమాన విధిస్తూ గోదావరిఖని అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ టి.శ్రీనివాసరావు గురువారం తీర్పునిచ్చారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. 16.8.2019న రామగుండం ప్రాంతానికి చెందిన ఓ మహిళ బహిర్భూమికి వెళ్లగా, నరేశ్ కోరిక తీర్చాలని బలవంతం చేశాడు. ఆమె ససేమిరా అనడంతో మహిళ నోట్లో మట్టి పోసి, రాళ్లతో దాడి చేసి గాయపరిచాడు. బాధితురాలి సోదరుడి ఫిర్యాదు మేరకు అప్పటి రామగుండం ఎస్సై శైలజ కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. అనంతరం కేసు అదనపు జిల్లా న్యాయస్థానంలో విచారణకు రాగా సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్సై సంధ్యారాణి, కోర్టు సీఎంఎస్ ఇన్‌చార్జి హెడ్ కానిస్టేబుల్ కె.శంకర్ ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ ఆఫీసర్ ఎస్.శ్రీధర్ 14 మంది సాక్ష్యులను కోర్టులో ప్రవేశపెట్టాడు. ప్రాసిక్యూషన్ తరఫున అప్పటి అదనపు పీపీ జ్యోతిరెడ్డి, ప్రస్తుత పీపీ ఆకుల రాములు తమ వాదనలు వినిపించగా నిందితుడిపై నేరం రుజువైంది. దీంతో న్యాయమూర్తి శిక్ష ఖరారు చేస్తూ తీర్పు చెప్పారు.